## ధరణితో భూములపై అనుమానాలు పోయినయ్



హనుమకొండ సిటీ : గతంలో ఒక్క సర్వే నెంబర్ పైనే బై నెంబర్‌తో పట్టా చేసుకోవడం, ఒకరి సర్వే నెంబర్‌పై ఇంకొకరు కబ్జాలో ఉండేది. తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ కొత్తగా ధరణి పోర్టల్ తీసుకు రావడం ద్వారా అలాంటి సమస్యలన్నీ తీరినయి. నేను కూడా బాధితున్నే. ధరణితో సరి చేసుకొని 2 ఎకరాల పొలానికి రైతు బంధు పొందుతున్నా. రైతుల నోటికాడ బుక్క మన్నులో కలిపేలా కాంగ్రెస్ పిచ్చి పిచ్చి ఆలోచనలు చేస్తోంది. ఎవరు తీసుకున్న గోతిలో వారే పడతారు అన్నట్లు ఆ వారి అనాలోచిత మాటలే ఆ పార్టీని కనుమరుగు చేస్తాయి. ఎలాంటి కిరికిరి లేకుండా రాష్ట్రాన్ని పాలిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం పదికాలాల పాటు ఉంటుంది.

**- నేతుల లక్ష్మణ్, రైతు హనుమకొండ**

## మూడు గంటలతో మడి కూడా తడ్వదు



హనుమకొండ : మూడు గంటల కరెంటుతో మడి కూడా తడ్వదు. కాంగ్రెస్ నాయకుల మాటలు సూత్తాంటే మళ్లీ కరెంటు కష్టాలు తెచ్చేటట్టు ఉన్నారు. గతంలో అరకొర కరెంటు ఇచ్చేవారు. రాత్రి పూట కరెంటు వల్ల ఎంతో మంది చనిపోయారు. అంతే కాక మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవి. దీంతో సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలు చేసేది. ఇప్పుడు సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు ఇస్తుండడంతో సంతోషంగా ఉంటున్నాం. రేవంత్‌రెడ్డికి ఎవుసం చేస్తే తెలిసేది.. ఎంత సేపు కరెంటు ఉంటే ఎంత పారుతుందని. కాంగ్రెస్ నాయకులవి పనికిమాలిన మాటలు. రైతుల కష్టాలు తెలిసిన కేసీఆరే మళ్లీ సీఎం కావాలి. అప్పుడే అందరం మరింత సంతోషంగా ఉంటాం.

**- మండల రవి, రైతు, నారాయణగిరి**



## కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవం

హనుమకొండ/హనుమకొండ చౌరస్తా, నవంబర్ 26 : హనుమకొండ కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ మన దేశ రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం అన్నారు. అనంతరం రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్వో గణేశ్, పరకాల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే, కేయూ ఫార్మసి కాలేజీలో రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. డాక్టర్ రామ్మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్లతో అవగాహన కల్పిస్తున్న అంపశయ్య నవీన్ తదితరులు

## 'జాగో ఓటర్ జాగో' అవగాహన సదస్సు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 26 : సులక్ష్య సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మండువ సంతోష్ అధ్యక్షతన పబ్లిక్ గార్డెన్స్‌లో 'జాగో ఓటర్ జాగో' పేరుతో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్ పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ దేశాలు ఓటు హక్కు కోసం చాలా పోరాటాలు చేశాయన్నారు. కానీ, భారత రాజ్యాంగం ఎలాంటి పోరాటం లేకుండానే ఓటు హక్కును మనందరికీ బహుమతిగా ఇచ్చిందన్నారు. దాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ వీ గోపాల్ రెడ్డి, సీనియర్ కార్డియాలజిస్ట్ రామక శ్రీనివాస్, వంగ గోపాల్‌రెడ్డి, గుర్రపు దామోదర్, కాజీపేట పురుషోత్తం, ప్రణీత్, శంతన్, కోడం వినయ్, బుక్క వంశీ, అజాం, అనిరుద్ రామ్, సిద్ధార్థ, విష్ణు, కిట్స్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

## ఎల్బీ కాలేజీలో 76వ ఎన్‌సీసీ డే

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 26 : ఎల్బీ కాలేజీలో 76వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని 10వ తెలంగాణ బెటాలియన్ ఆర్మీ కెడెట్స్ ఎన్‌సీసీ అక్షరాల రూపంలో కూర్చుని అందరిని ఆబ్బురపరిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ, కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, కమాండింగ్ అధికారి కల్నల్ అజయ్ నంద ఖండూరి, సుబేదార్ ఇమేజెస్ సుహాస్కథం, జూనియర్ అండర్ ఆఫీసర్ ఓంశ్రీ, పవన్, భరత్, రాధిక, నాగరాజు, విష్ణు, రాజు, సంతోషి, సృజన, శృతి, శ్రావణి పాల్గొన్నారు.



ఎన్‌సీసీ అక్షరాల క్రమంలో కెడెట్స్

## సామూహిక సత్యనారాయణ వ్రతాలు

హనుమకొండ, నవంబర్ 26 : కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని హనుమకొండ సాయిబాబా మందిరంలో ఆదివారం పూజారులు కిశోర్ శర్మ, మణిశర్మ, చందు ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. 150 మంది దంపతులు వ్రతాన్ని ఆచరించారు. మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ధర్మకర్తలు సదానందం, శ్రీనివాస్, రమేశ్, సురేశ్ పాల్గొన్నారు. కాగా, రాత్రి జ్వాలా తోరణం కార్యక్రమం నిర్వహించారు.

## నేడు మున్నూరుకాపు వనభోజనాలు

న్యూశాయంపేట, నవంబర్ 26 : హంటర్‌రోడ్డులోని అభిరామ్ గార్డెన్స్‌లో సోమవారం మున్నూరుకాపు కార్తీక వనభోజనాలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ కనుకుంట్ల రవికుమార్ తెలిపారు. మున్నూరు కాపులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# సగరుల సమస్యలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తా

- పిలిస్తే పలికే నేను కావాలా..?
- రౌడీలు, గుండాలతో తిరిగేవారు కావాలా..?
- హైదరాబాద్‌తో పోటీపడేలా నియోజవర్గానికి నిధులు
- ఆత్మీయ సమ్మేళనంలో చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్





సగర సంఘం ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 26: 'ప్రజల కష్టాల్లో వెన్నంటే ఉంటూ పిలిస్తే పలికే నేను కావాలా..? రౌడీలు, గుండాలతో తిరిగే వారు కావాలా?' అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం కేయూ రోడ్డులోని 5వ డివిజన్ ఏజీఆర్ గార్డెన్‌లో సగర(ఉప్పర) సంఘం ఆత్మీయ సమ్మేళనం మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేశానన్నారు. నియోజకవర్గాన్ని హైదరాబాద్‌తో పోటీపడేలా నిధులు తీసుకువచ్చినట్లు చెప్పారు. కాజీపేట వద్ద రూ.75 కోట్లతో కొత్త బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే, రోడ్డు వెడల్పులు, సైక్లింగ్ ట్రాక్, పార్కులు, సెంట్రల్ లైటింగ్, వాకింగ్ ట్రాక్‌లు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఉద్యమకారులపై కాల్పులు జరిపిన వ్యక్తిపై పోటీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేస్తుంటే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. పార్లమెంటరీ సెక్రటరీగా తనకు పదవి ఇచ్చినా ముఖ్యమంత్రి పక్కన ఉండకుండా నిత్యం ప్రజల వెంటే ఉంటున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు చేసే దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మరని అన్నారు. మూడు ప్రధాన కూడళ్ల వద్ద భగీరథ మహర్షి విగ్రహాలను ఏర్పాటు చేస్తానని తెలిపారు. వృద్ధాశ్రమం, పోచమ్మకుంటలో సగర భవనం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అలాగే, కోమలకుంట శ్మశానవాటికను అభివృద్ధి చేస్తానన్నారు. సగరుల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కొంతమంది కార్పొరేటర్లను గెలిపించుకోలేక పోయినా వారికి కచ్చితంగా సముచిత స్థానం కల్పిస్తామన్నారు. భవన నిర్మాణ కార్మికుల కోసం సొంత ఖర్చులతో కార్మిక భవనం కేటాయించిన ఘనత ఎంజాల మల్లేశంకే దక్కిందన్నారు. మంత్రి కేటీఆర్ రూ.2కోట్లతో కార్మిక భవనం ప్రారంభించినట్లు చెప్పారు. అనంతరం వినయ్‌భాస్కర్‌ను మాజీ కార్పొరేటర్ తాటిశెట్టి విద్యాసాగర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్, సగర భగీరథ ఆత్మగౌరవ భవనం చైర్మన్ ఆస్కాని మారుతీసాగర్, ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం, జిల్లా అధ్యక్షుడు పొట్లపెల్లి సురేశ్, సగర సంక్షేమ సంఘం హనుమకొండ అధ్యక్షుడు సీత కమలాకర్‌రావు, 50వ డివిజన్ కార్పొరేటర్ నెక్కొండ కవితా–కిషన్, 54వ డివిజన్ కార్పొరేటర్ గుంటి రజితా–శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ వీరగంటి రవీందర్, 8వ డివిజన్ ఇన్‌చార్జి నలుబోల సతీశ్, సక్కుబాయి, రుద్ర, నలుబోలు రాజా, తాడిశెట్టి మహేశ్, కానుగంటి అరవింద్, అనిశెట్టి జీవన్, వినయ్, మీనయ్య పాల్గొన్నారు.

## రెడ్డి సంక్షేమ భవనం ఏర్పాటుకు కృషి చేస్తా

నయీంనగర్ : రెడ్డి సంక్షేమం భవనం ఏర్పాటు కోసం కృషి చేస్తానని దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండలోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో రెడ్డి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెడ్డి కులస్తులకు సముచిత స్థానం కల్పించినట్లు తెలిపారు. రానున్న బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెడ్డి సంక్షేమ భవన్ ఏర్పాటుతో పాటు రెడ్డి సంక్షేమానికి తోడ్పాటునందిస్తామని అన్నారు. నియోజకవర్గంలో రెడ్డిలు కారు గుర్తుకే ఓటేసి గెలిపించాలని కోరారు. అనంతరం తమ సంపూర్ణ మద్దతు బీర్ఎస్‌కే అంటూ రెడ్డి కులస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, రాకేశ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

# ప్రజా సేవకుడికి మద్దతుగా నిలవండి

- కారు గుర్తుకు ఓటు వేసి దాస్యంను గెలిపించండి
- చీఫ్‌విప్ సతీమణి రేవతి
- పలు డివిజన్లలో కొనసాగుతున్న ప్రచారం

కాజీపేట/మడికొండ/గిర్మాజీపేట/హనుమకొండ సిటీ, నవంబర్ 26 : ప్రజా సేవకుడు దాస్యం వినయ్‌భాస్కర్‌కు ప్రజలందరూ మద్దతుగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించాలని చీఫ్‌విప్ సతీమణి దాస్యం రేవతి కోరారు. కాజీపేట 62వ డివిజన్ సోమిడిలో వినయ్‌భాస్కర్ గెలుపు కోసం ఆదివారం స్థానిక డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల శివకుమార్ అధ్యక్షతన ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. అలాగే, కాంగ్రెస్, బీజేపీల నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పారు. అలాగే, 63వ డివిజన్‌లో కూడా ప్రచారం చేశారు. బెదర కోట రంజిత్‌కుమార్, ఎండీ సోని, సుంచు కృష్ణ, కాటాపురం రాజు, తేలు సారంగపాణి, బస్వ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు. కాగా, గ్రేటర్ 29వ డివిజన్‌లో బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి నమూనా ఈవీఎంతో ప్రచారం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్, సీనియర్ నాయకులు రాచర్ల రాము, గట్టు చందుగౌడ్, రుద్ర శ్రీను, ఎండీ షఫీ, కొప్పుల సతీశ్ పాల్గొన్నారు. 9వ డివిజన్‌లో బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. డివిజన్ ఇన్‌చార్జి నజీర్, చీకటి ఆనంద్, పస్తం అనిల్ పాల్గొన్నారు.



కాజీపేట : సోమిడిలో మహిళను ఓటు వేయాలని కోరుతున్న దాస్యం రేవతి



గిర్మాజీపేట : 29వ డివిజన్‌లో నమూనా ఈవీఎంతో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



హనుమకొండ సిటీ : 9వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు